వాల్మీకి రామాయణం.. జీవిత పారాయణం



వాల్మీకి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, లింగ్యానాయక్, ఉమా హారతి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాల్మీకి రచించిన రామాయణం మానవ జీవితానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతిలతో కలిసి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి ఒక బోయ అని, ఆయన స్ఫూర్తితో అనేక మంది రచయితలుగా, కవులుగా మారారని తెలిపారు. గొప్ప వారి చరిత్ర తెలుసుకోవడం నేటి తరానికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమాధికారి కమలాకర్‌రెడ్డి, డీపీఆర్‌ఏ చెన్నమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల సహాయ అధికారి భీంరావు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సీసీఐలో గ్రాట్యుటీ దస్త్రాల పరిశీలన

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారంలో గ్రాట్యుటీ బకాయిలకు సంబంధించి దస్త్రాలను పరిశీలించేందుకు ఈనెల 28, 29 తేదీలలో సీపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణ్‌కోటకు రానున్నారు. ఈ విషయాన్ని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి టి.శరణప్ప తెలిపారు. గ్రాట్యుటీ బకాయి కార్మికులతో కలిసి ఆయన గురువారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దస్త్రాలను పరిశీలించేందుకు అధికారులు వస్తున్నారన్నారు. కర్మాగారానికి వచ్చే అధికారికి అన్నిపత్రాలను సమర్పించాలని ఆదేశించారని తెలిపారు.

వసతి.. వెలితి

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ఠ

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. అసలే చలికాలం. ఈ సమయంలో అసౌకర్యాల మధ్య ఎలా నెట్టుకు రావాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పిల్లల స్థితిగతులు తలుచుకుని తల్లిదండ్రులు సైతం ఆవేదనకు గురవుతున్నారు. సమస్యలను పరిష్కరించి సౌకర్యాలు కల్పించే విధంగా సర్కారు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని స్థితిగతులు, విద్యార్థుల ఇక్కట్లపై 'న్యూస్‌టుడే' 'పరిశీలనాత్మక' కథనం. – న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్, పెద్దేముల్.

పలుచోట్ల ఇదీ పరిస్థితి

- పక్కా భవనాల కొరత.
- మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ ఘోరం.
- తాగేందుకు శుద్ధి నీరూ కరవు.
- విద్యుత్తు తీగలు అస్తవ్యస్తం.
- ఊడి పోయిన తలుపులు, కిటికీలు.
- జాడలేని వేడి నీరు.
- సరిపోని దుప్పట్లు.
- వర్షం పడితే ఉరుస్తున్న గదులు.

విభాగాలు	మొత్తం	విద్యార్థులు
• బీసీ వసతి గృహాలు	30	2700
• ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు	7	2300
• ఎస్టీ గురుకులాలు	5	3000
• సాంఘిక సంక్షేమం	25	2300



పైకప్పు పెచ్చులూడుతున్నాయి



పరిగిలోని బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. స్థానికంగా 130 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నారు. తరచూ భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి.

యాలాల: యాలాల మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం భవనం పైకప్పు మొత్తం ఇనుపచువ్వలు తేలిపోయింది.

బకెట్లతో తీసుకెళ్తున్నారు



ధారూర్: ధారూర్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో 8 స్నానపు గదులు, మరో 8 శౌచాలయాలు ఉన్నా వాటికి ట్యాంకుల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులే బకెట్‌ల ద్వారా తీసుకువెళుతున్నారు.

నీటి మడుగు దాటితేనే వెళ్లగలిగేది

తాండూరు, తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ఎస్టీబాలుర వసతి గృహంలో శౌచాలయాలు, స్నానాల గదులకు వెళ్లాలంటే సమీపంలోని వర్షపు నీటి మడుగును దాటక తప్పదు. మడుగు నుంచి నీరు ఎక్కువగా బయటికి వెళ్లే పరిస్థితిలేక అపరిశుభ్రంగా మారి ఈగలు, దోమల బెడద పెరిగిపోతోంది.

గదిలోనే ఆరేస్తున్నారు



పెద్దేముల్‌లో బీసీ బాలుర వసతి గృహంలో తప్పనిసరై దుస్తులు గదిలోనే ఆరేయాల్సి వస్తోంది. సెలవులు వస్తే ఎవరు ఉంటున్నారు.. ఎవరు బయటికి వెళ్తున్నారనేది తెలియడంలేదు.

మరమ్మతుకు ప్రతిపాదనలు

వసతి గృహాల్లో విద్యార్థులు ఇబ్బంది పడకుండా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రయత్నం చేస్తున్నాం. ఎక్కడెక్కడ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉందన్న విషయమై ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పరిష్కరిస్తాం. **–ఉపేందర్, జిల్లా బీసీ సంక్షేమాధికారి.**

పనిచేయని ఆర్వో ప్లాంట్



దుద్యాల: మండలంలోని చెట్టుపల్లి తండా దగ్గర ఉన్న కేజీబీవీ పాఠశాలలో మొత్తం 288 మంది బాలికలకు తగిన శౌచాలయాలు లేవు. ఆర్‌ఓ ప్లాంట్ పని చేయడం లేదు.

ముళ్లకంపే ప్రహరీ..



మోమిన్‌పేట: మోమిన్‌పేట ఎస్సీ బాలుర వసతి గృహం ప్రహరీ కూలడంతో ముళ్లకంప, పిచ్చిమొక్కలను అడ్డుగా పెట్టారు. దీంతో తరచూ వీటిని దాటుకుని వసతి గృహంలోకి పందులు కుక్కలు వస్తున్నాయి.

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల నిరసన



పరిగి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట..

పరిగి, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం పరిగిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలను చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

● తాండూరుగ్రామీణ: అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బుగ్గప్ప ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షురాలు బేబీ, రాణిలు డిమాండ్ చేశారు. తాండూరులోని స్త్రీ శిశు సంక్షేమ కార్యాలయంలో అదనపు సీడీపీఓ శ్రీలక్ష్మీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం అందజేసి మాట్లాడారు. చిన్న అంగన్‌వాడీ కేంద్రాలను సాధారణ కేంద్రాలుగా గుర్తించి ఐదు నెలలు గడిచినప్పటికీ వేతనాల పెంపు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు ప్రమీల, మంగ్లీబాయి, లలిత పాల్గొన్నారు.

21 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

బషీరాబాద్: ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కార్యాలయం నుంచి అన్ని మండలాల విద్యావనరుల కేంద్రానికి ఇప్పటికే పరీక్ష ప్రశ్న పత్రాలు చేరుకున్నాయి. ప్రాథమికంలో 21న తెలుగు, ఉర్దూ (మొదటి లాగ్వేజ్), 22న ఆంగ్లం, 23న గణితం, 24న సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించనున్నారు. 28 వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి.

గ్రంథాలయాల ప్రతిష్ఠ ఇనుమడింపజేయండి



రాజేష్‌రెడ్డిని సత్కరిస్తున్న శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బుయ్యని, టీఆర్ఆర్, ప్రజా ప్రతినిధులు

వికారాబాద్, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు పేరు, ప్రతిష్ఠలకు నిలయమని, ఆ పేరును ఇనుమడింపజేయాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవనంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా ఎస్.రాజేష్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో గొప్ప వ్యక్తులు గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా పని చేశారని, వారి మార్గంలో నూతన అధ్యక్షుడు పయనించాలన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో గ్రంథాలయంలోనే చదువుకునే వాడినని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ, పుస్తకాల అధ్యయనం ఒక తపన అన్నారు. కార్యక్రమంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, వైశ్య ఫెడరేషన్ అధ్యక్షురాలు కల్వ సుజాత, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, పురపాలిక అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



బావిని పరిశీలిస్తున్న అదనపు పాలనాధికారి సుధీర్


వికారాబాద్ గ్రామీణ: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా అదనపు పాలనాధికారి సుధీర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మైలార్‌దేవరంపల్లి గ్రామంలో పర్యటించి ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా నిర్మించిన సీసీరోడ్లు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, అంగన్‌వాడీ భవనాలకు సుందరీకరణ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. గ్రామంలో తిరుగుతూ మంచినీటి ట్యాంకుల నీరు వృథా అధికంగా ఉందని బాగు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానందరం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తండాల్లో రాత్రిపూట డ్రోన్ల కలకలం



బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని గాజులకుంట తండా, సూర్యానాయక్ తండా, మల్లెవోనికుంట తండాల్లో గురువారం రాత్రి ఆకాశంలో డ్రోన్లు తిరగడం కలకలం సృష్టించింది. ఒకేసారి ఐదు నుంచి ఆరు వరకు డ్రోన్లు తిరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. దుద్యాల మండలంలోని పలు గ్రామాల్లో కూడా కొన్ని రోజుల కిందట ఇదే విధంగా డ్రోన్లు తిరిగాయి. అక్కడ ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. మున్ముందు ఇక్కడ కూడా అదే జరుగుతుందా అనే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేశారు.

కర్షకులకు కలిసొచ్చే మద్దతు ధరలు



న్యూస్‌టుడే, తాండూరు, వికారాబాద్: కేంద్ర ప్రభుత్వం యాసంగిలో సాగు చేసే శనగ (బెంగాల్ గ్రామ్) సహా ఆరు పంటలకు మద్దతు ధరలు పెంచడంతో జిల్లా రైతులు ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఏర్పడింది. ప్రస్తుత యాసంగి సాగుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆవాలు, మసూర్‌దాల్ (ఎర్ర కంది పప్పు), బార్లీ, గోధుమ, కుసుమ, శనగ పంటలకు మద్దతు ధరను పెంచుతూ ప్రకటన చేసింది. జిల్లాలో ఆవాలు, ఎర్రకంది పప్పు, బార్లీ పంటలను సాగు చేయరు. శనగ, కుసుమను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే గోధుమను నామమాత్రంగా సాగు చేస్తారు. ఈ మూడు పంటలకు దక్కే మద్దతు ధరతో ఆర్థిక లబ్ధి పొందనున్నారు.

జిల్లాలో యాసంగి అంచనా ఇది

పంట	అంచనా.. (ఎకరాలు)
శనగ..	3,371.16
కుసుమ..	1,310
గోధుమ..	55

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగిలో రైతులు శనగ, కుసుమ, గోధుమ సాగు చేపట్టారు. తాజాగా పెరిగిన మద్దతు ధరల నేపథ్యంలో రైతులు పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది.

ఇవీ మద్దతు ధరలు (రూ.లలో)

పంట	2023–24	2024–25	పెంపు
శనగ	5,440	5,650	210
కుసుమ	5,800	5,940	140
గోధుమ	2,275	2,425	150

● కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచిన పంటల సాగుకు పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉంటుంది. శనగ పంట సాగుకు ఎకరాకు అన్ని ఖర్చులు కలిపి రూ.8,000 అవుతుంది. సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రేగడి పొలాల్లో 6 నుంచి 7 క్వింటాళ్లు, సాధారణ పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. కుసుమ సాగుకు పెట్టుబడి రూ.12,000 అవుతుంది. రేగడి పొలాల్లో 7 నుంచి 8 క్వింటాళ్లు, సాధారణ పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. ఇక గోధుమల సాగుకు రూ.10 వేలు పెట్టుబడి అవుతుంది. దిగుబడి 8 క్వింటాళ్ల వరకు వస్తుంది.

మంచి పరిణామం

మద్దతు ధరల పెంపు మంచి పరిణామం. ఆశాజనకంగా వచ్చే దిగుబడులకు మద్దతు ధర లభిస్తుంది కాబట్టి పెట్టుబడులు పోను రైతులకు ఎంతో మిగులుతుంది. ఇది వారి ఆర్థిక అవసరాలను కొంత మేరకు తీరుస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు పెరిగిన మద్దతు ధరలు అమల్లో ఉంటాయి.**– రుద్రమూర్తి, వ్యవసాయ సహాయ సంచాలకులు, తాండూరు.**

రబీలో కుసుమ సాగు లాభదాయకం

పూడూరు: రబీలో కుసుమ సాగు లాభదాయకమేనని, కండ్లపల్లి పొలాలు కుసుమ పంటలకు చాలా అనుకూలమైనవని శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ పరిశోధన సంస్థ తాండూరు ఆధ్వర్యంలో కుసుమ పంట సాగుపై అవగాహన కల్పించారు. రైతులకు ఉచితంగా కుసుమ విత్తనాలు అందజేశారు. మండల వ్యవసాయాధికారి తులసీరాం, నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

భగీరథ సిబ్బందికి వేతనాలు పెంచండి

కొడంగల్, న్యూస్‌టుడే: మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని గురువారం కార్మికులు 'కడా' కార్యాలయంలో ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నా జీతాలు పెంచడలేదన్నారు.

సర్కారు భూములను గ్రామాలకు కేటాయించాలి



మాట్లాడుతున్న గ్రామస్థులు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను గ్రామ అవసరాలకు కేటాయించాలని సిరిగిరిపేట గ్రామస్థులు డిమాండ్ చేశారు. గ్రామ శివారులోని సర్కారు భూముల్లో కొందరు హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తుండగా గ్రామస్థులు బుధవారం అడ్డుకొని వెనక్కి పంపించిన విషయం తెలిసిందే. ఆ భూములను తాము కొనుగోలు చేశామంటూ కొందరు గురువారం గ్రామస్థులకు దస్త్రాలు చూపించారు. అయినప్పటికీ భూముల్లోకి అనుమతించేది లేదని గ్రామస్థులు తెగేసి చెప్పారు. ఆయా ప్రభుత్వ భూముల్లో స్మశానాలు, రైతుల పొలాలు ఉన్నాయని, సంకిరెడ్డిపల్లి, అల్లాపూర్, జినుగుర్తికి వెళ్లేందుకు అనుబంధ రహదారులు ఉన్నాయని వివరించారు. హద్దు రాళ్లు పాతేసి భూములు లాక్కుంటే ఇవన్నీ కోల్పోవాల్సి వస్తుందన్నారు.

అన్ని విషయాలపై అవగాహన అవసరం



శిక్షణ కానిస్టేబుళ్లు రాస్తున్న పరీక్షను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్: శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకోవాలని, అన్ని విషయాలపై అవగాహన ఉంటేనే భవిష్యత్తులో సమర్థంగా విధులు నిర్వహించడానికి సులభంగా ఉంటుందని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లకు నిర్వహించిన టర్మ్-2 వార్షిక పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణ కాలం విద్యార్థి దశలాంటిదని, శిక్షణలో చదువుకున్న, నేర్చుకున్న అంశాలే ఉపయోగపడి గుర్తింపును తెచ్చి పెడతాయన్నారు. శిక్షణ అనంతరం చెప్పేవారు, నేర్పేవారెవరూ ఉండరని, అందుకే ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకళింపు చేసుకొని రాటుదేలే బాధ్యత మీదన్నారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్, ఏఎస్పీ మురళీధర్, జడ్చర్ల డీటీసీ డీఎస్పీ నర్సిములు పాల్గొన్నారు.

విపణి ఆదాయం.. లక్ష్యం అధిగమించె



న్యూస్‌టుడే, తాండూరు:

జిల్లాలోని వ్యవసాయ విపణులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల్లో లక్ష్యానికి మించిన ఆదాయం సాధించాయి. పది విపణిల్లో తాండూరు విపణికి ప్రత్యేక శ్రేణి హోదా ఉంది. గ్రేడ్-1 విపణిగా వికారాబాద్, గ్రేడ్-2 విపణులుగా పరిగి, మర్పలికి పేరుంది. మిగిలిన బషీరాబాద్, ధారూర్, కొడంగల్, కోట్‌పల్లి, కుల్కచర్ల, నవాబుపేట విపణులు సహాయ కార్యదర్శి హోదాకు సంబంధించినవి. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ప్రభుత్వం రూ.7.42 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని విధించింది. అయితే రూ.6.42 కోట్లు ఎక్కువతో రూ.13.84 కోట్లు ఆదాయాన్ని ఆర్జించాయి. గడచిన 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 5.62 కోట్ల లక్ష్యానికిగాను రూ.4.16 కోట్ల ఆదాయమే వచ్చింది.

● రావాల్సింది రూ.6.42 కోట్లు
● వచ్చింది రూ.13.84 కోట్లు

మొదటి స్థానంలో కొడంగల్ విపణి

జిల్లాలోని పది విపణిల్లో కొడంగల్ విపణి ఎక్కువ ఆదాయం సమకూర్చుకుని మొదటి స్థానంలో నిలిచింది. తాండూరు, పరిగి, వికారాబాద్ రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. మిగిలిన విపణిలు రూ.4వేల నుంచి 1.30 లక్షల ఆదాయాన్ని మాత్రమే సమకూర్చుకున్నాయి. కొడంగల్ విపణి ఆర్థిక లక్ష్యం రూ.96.50 లక్షలుగా ఉంటే 3.75 కోట్లు సమకూరాయి. గడచిన వానాకాలంలో రైతులు 5,78, 874 సాధారణ సాగు విస్తీర్ణానికి గాను 5,30,882 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. అయితే దిగుబడులు వచ్చింది మాత్రం కేవలం పెసలు, మినుములు, సోయాబిన్ పైర్ల నుంచే. సాగు కూడా తక్కువగానే ఉంది. పెసలు 12,513 ఎకరాలు, మినుములు 5,108 ఎకరాలు, సోయాబిన్ 2,185 ఎకరాల్లో సాగైంది. వీటి నుంచి వచ్చిన దిగుబడులు నామమాత్రమే. పెద్దగా ఆదాయం సమకూరలేదు. అయితే గతేడాది కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన లక్షల క్వింటాళ్ల ధాన్యం, పత్తికి సంబంధించిన మార్కెట్ ఫీజు తాజా ఆర్థిక సంవత్సరంలో సమకూరింది. దీన్ని లెక్కలోకి తీసుకున్నారు.

ఆరు నెలల ఆదాయ లక్ష్యాలు రూ.కోట్లలో..

విపణిపేరు	ఆర్థిక లక్ష్యం	సమకూరింది
తాండూరు	1.67	3.27
పరిగి	2.15	2.24
వికారాబాద్	1.09	2.19
ధారూర్	0.36	1.04

వచ్చే ఆరు నెలల్లో మరింత ఆదాయం

వ్యవసాయ విపణిలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మిగిలిన ఆరు నెలల్లో మరింత ఆదాయం సమకూరనుంది. కందులు, మొక్కజొన్నలు, పసుపుతో పాటు పత్తి, ధాన్యం విక్రయాలు భారీగా జరగనున్నాయి. వీటి విక్రయ విలువలో రూ.100కు 1శాతం చొప్పున వచ్చే ఆదాయం రూ.కోట్లల్లోనే ఉంటుంది. విపణిలకు సమకూరిన ఆదాయంతో పాలక వర్గాలు చేసిన తీర్మానాలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొంది రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తాం.**– సారంగ పాణి, జిల్లా వ్యవసాయ విపణుల అధికారి.**

విద్యా రుణానికి గడువు 29

వికారాబాద్ కలెక్టరేట్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా పథకం కింద జిల్లాలో అర్హులైన అభ్యర్థులు రూ.20 లక్షల విద్యా రుణం కోసం ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం గురువారం తెలిపారు. ఎస్సీ విద్యార్థులు బీటెక్ పూర్తి చేసి మాస్టర్ విద్య అభ్యసించటానికి విదేశాలకు వెళ్లవచ్చన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయకండి



శిక్షణ పొందిన నీటి సహాయకులతో అధికారులు


మోమిన్‌పేట: తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ డీఈఈ రత్నప్రసాద్ గ్రామ పంచాయతీ నీటి సహాయకులకు సూచించారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయం సమావేశం మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్రువ పత్రాలను అందజేస్తూ మాట్లాడారు. ఎంపీడీవో విజయలక్ష్మి, డీఈఈ సువర్చల, ఎంపీవో యాదగిరి పాల్గొన్నారు.

గురుతర బాధ్యతతో అడుగేయ్

పాఠశాల రూపురేఖలను మార్చాలంటే కృతనిశ్చయం అవసరం. తోటివారితో పాటు పిల్లలు, తల్లిదండ్రుల మనసు గెలవాలి. సంకల్పం నెరవేరే వరకు విశ్రమించొద్దు.

ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు ప్రత్యక్ష మార్గదర్శి. క్రమశిక్షణ, అంకిత భావం, సేవా కోణం, చైతన్య కెరటం.. ఇలా భిన్న పాత్రల సమాహారమే గురువు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో తాజాగా వందలాది మంది ఉపాధ్యాయ కొలువులు చేపట్టారు. వీరంతా తమ ప్రత్యేకతను చాటాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఇందులో సాగుతున్న ఎంతో మంది మార్గదర్శకంగా నిలిచారు. తమదైన శైలి.. సృజనాత్మక బోధనతో విద్యార్థులతో మా మంచి మాస్టారు అని కీర్తినొందుతున్నారు. ఇలాంటి ఆదర్శప్రాయులను నవతరం బోధకులు అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, సిద్దిపేట



జాతీయ పురస్కారం గెలిచి..



సిద్దిపేటకు చెందిన రామస్వామి 2015 నుంచి 2022 వరకు ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేశారు. బడిని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో గురుతర పాత్ర పోషించారు. బాధ్యత చేపట్టిన ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చారు. విద్యార్థులు 300 మంది నుంచి వేయి సంఖ్య దాటేందుకు సమష్టిగా కృషి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సాంకేతిక వినియోగంలో స్ఫూర్తి చాటారు. 2022లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం సిద్దిపేట డీఈవో కార్యాలయంలో ప్రణాళిక విభాగం సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట

బడిని బతికించి..



ఎంతోమందిలో విద్యా వెలుగులు నింపేది పాఠశాలే. దీని సంరక్షణ అందరి బాధ్యత. బడి మాది అనుకుంటే పిల్లలెంతో మంది బాగుపడ్డట్లే.

మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ పాఠశాలలో 2015లో విద్యార్థుల సంఖ్య కేవలం 8 మందే. స్థానిక పిల్లలంతా ప్రైవేటుకు వెళ్తున్నారు. ఈ తరుణంలో హెచ్ఎంగా ఓంకార్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులుగా నుస్రత్, రామకృష్ణారెడ్డి బదిలీపై వచ్చారు. బడిని బతికించుకోవాలని కంకణం కట్టుకున్నారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారిని ఒప్పించి పిల్లలను ప్రైవేటుకు పంపించమని తీర్మానం చేయించారు. వారికి స్థానికులు అండగా నిలిచారు. ప్రస్తుతం 207 మంది ఉన్నారు. ఇప్పటికీ ఆ ఉపాధ్యాయులు చైతన్యంతో బడి వెలిగిపోతోంది. పలు పురస్కారాలూ దక్కాయి. – న్యూస్‌టుడే, ములుగు

వారితో మమేకమై..

సమాజ పరిస్థితిని మార్చడంలోనూ ఉపాధ్యాయుడిది కీలకపాత్ర. ఈ మార్గంలో నడిస్తే ఎంతో మంది బాగుపడటం ఖాయం.

విద్యార్థుల మనసు గెలవడం కాసింత కష్టమే. అలాంటి వారు ఎక్కడో ఓ చోట కనిపిస్తారు. ఒక్కసారి పిల్లలను ఆకట్టుకుంటే గుండెల్లో పెట్టుకొని పూజిస్తారు.



కొడంగల్ పరిధి పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన క్రాంతికుమార్.. విద్యార్థులతో మమేకమై బోధించారు. పిల్లలకు అన్నిరకాలుగా అండగా నిలిచారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పేదలకు సాయం అందించారు. నవోదయ, గురుకుల వంటి పరీక్షల్లో విజయానికి కృషి చేశారు. తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత చెప్పి బడికి పంపించేలా చేశారు. విధుల్లో చేరిన సమయంలో 27 మంది ఉండగా. ఆ తర్వాత 64కు చేరింది. ఇటీవల హుసేన్‌పూర్‌కు బదిలీ కాగా, ఆ సమయంలో విద్యార్థులు, గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు.

– న్యూస్‌టుడే, కొడంగల్

పిల్లలు నష్టపోవద్దని..



ఆకట్టుకునేలా బోధించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం. ఇందుకు ఎంతో కృషి అవసరం. వారి సర్వతోముఖాభివృద్ధికి చొరవ చూపాలి.

సాధారణంగా సెలవు దొరికితే ఎవరైనా సరదాగా గడుపుదాం అనుకుంటారు. రామాయంపేట ఉన్నత పాఠశాలలో ఆంగ్లం బోధించే రమేశ్ మాత్రం అలా కాదు. మండలంలోని కాట్రియాల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకులు లేకపోవడంతో ఈయనే చొరవ చూపి అక్కడికెళ్లి పాఠాలు చెబుతూ వచ్చారు. సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠ్యాంశాలు బోధించారు. మరోవైపు ఇతర పిల్లలకు సైతం ఇంగ్లిషు నేర్పించడం విశేషం.

- న్యూస్‌టుడే, రామాయంపేట

మానవత్వం చాటుతూ..



మతిస్థిమితం లేని బాలికను చేరదీసి..

గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన జంగం సౌజన్య మెదక్ జిల్లా కౌడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. ఈమె సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. ఎవరైనా అభాగ్యులు, ఆపదలో ఉన్న వారు కనిపిస్తే చలించిపోతారు. మతిస్థిమితం కోల్పోయిన వారిని చేరదీసి వారి ఆకలిని తీరుస్తున్నారు. ఆశ్రమాల్లో చేర్పిస్తారు. మహిళలను సఖి కేంద్రానికి తరలిస్తున్నారు. ఇప్పటివరకు 8 మందిని ఆదుకున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

అన్నింటా తీర్చిదిద్ది..



విద్యార్థులతో శ్రీనివాస్‌రావు

విద్యార్థుల భవితకు మార్గం చూపాల్సిన గురుతర బాధ్యత గురువులదే. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దు.

జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం జడ్పీ పాఠశాల హెచ్ఎంగా 8 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అడ్డాడ శ్రీనివాస్‌రావు.. తెలుగు ఉపాధ్యాయుడైన ఈయన విద్యార్థులు వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేలా చేశారు. ప్రత్యేక చొరవ చూపి 150 మంది బాలకవులు, 200 మంది పుస్తక సమీక్షలో, మరో 100 మంది కథలు రాసే ప్రతిభావంతులుగా రూపుదిద్దడంలో కీలకంగా వ్యవహరించారు. సెలవులను సైతం ఇందుకే కేటాయించేవారు. ఇటీవల ఎద్దుమైలారం జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు.

– న్యూస్‌టుడే, జిన్నారం

సైన్స్‌లో ఇప్పటికీ వెనకబడి ఉన్నాం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని పలు చిన్నదేశాలు విభిన్న అంశాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, 140 కోట్లకుపైగా జనాభా ఉన్న అతి పెద్ద దేశం భారత్ ఈ విషయంలో ఇంకా వెనకబడి ఉందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. చిప్స్ తయారీలో ముందున్న తైవాన్‌పై బలమైన దేశాలు ఆధారపడుతున్నాయని.. ఈ తరహాలో భారత్ సైతం కొన్ని అంశాల్లో ఆధిపత్యానికి ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ మంత్రి మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ డైరెక్టర్ జనరల్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటి తెలుగు ఉపకులపతి డాక్టర్ సూరి భగవంతం జయంతి వేడుకలు గురువారం ఓయూలోని దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. మనదేశం రక్షణ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా స్వయం సమృద్ధి సాధించడం వెనక డీఆర్డీవో డీజీగా డాక్టర్ సూరి భగవంతం వేసిన పునాదే కారణమని డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ దూరం లక్ష్యాన్ని గురిపెట్టే గన్ భారత్‌లో మాత్రమే ఉందని.. ఈ దశకు చేరుకోవడంలో సూరి కృషి ఉందన్నారు.



ఐఐటీహెచ్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తికి అవార్డు అందజేస్తున్న ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ సతీష్‌రెడ్డి చిత్రంలో డాక్టర్ భుజంగరావు, ఎస్.బి.రామ్, లక్ష్మీనారాయణ

ఐదుగురికి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సూరి భగవంతం ఎక్సలెన్స్ అవార్డులను ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, ఇస్రో-ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్, ఇంటిలిజెంట్ డిజైన్ ఏఐ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డకు ప్రదానం చేశారు. డీఆర్‌డీవో మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ యు.రాజబాబు స్థానంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఎ.ఎస్.మూర్తికి, రివి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మొచ్చెర్ల శశిభూషణ్ స్థానంలో శరత్‌కు అవార్డులను బహూకరించారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో మాజీ డీజీ వి.భుజంగరావు, డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.బి.రామ్ తదితరులు మాట్లాడారు.

వేదన.. రోదన

- శోకసంద్రంగా మారిన తూప్రాన్ ఆసుపత్రి ఆవరణ
- మృతదేహాల కోసం వచ్చిన బాధితులు

తూప్రాన్, శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతిచెందిన విషయం విదితమే. గురువారం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కట్టుదిట్టమైన పోలీసుల భద్రత మధ్య శవ పంచనామా నిర్వహించారు. ఈ సమయంలో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. ఈ క్రమంలోనే కొంతమంది సొమ్మసిల్లి కింద పడిపోయారు. మృతదేహాలను చూసేందుకు బంధువులు భారీగా తరలివచ్చారు. డీఎస్పీ వెంకటరెడ్డి, ఆస్పత్రి పర్యవేక్షకులు అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల సమయంలో శవ పంచనామా ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఏడు మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. మృతదేహాలను ట్రాక్టర్‌లో ఎక్కించే సమయంలో మృతురాలు అనిత భర్త మోహన్ బంధువులు ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నామ్‌సింగ్‌ను తీసుకొచ్చే వరకు మృతదేహాలను తీసుకెళ్లమని నిరసన తెలిపారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



విషణ్ణవదనాలతో బాధిత కుటుంబ సభ్యులు



పోలీసు పహారాలో అంత్యక్రియలు

శివ్వంపేట మండలంలోని మూడు తండాల్లో పోలీసు భద్రత మధ్య రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు జరిగాయి. భీమ్లా తండాలో గూగులోత్ శాంతి, ఆమె కూతురు మమత (10వ తరగతి), జగ్య తండాలో మాలోత్ అనిత, ఆమె కుమార్తెలు హిందు(8వ), శ్రావణి (5వ), తాళ్లపల్లి తండాలో ధనావత్ శివరాం, దుర్గి అంత్యక్రియలు చేపట్టారు. మూడు కుటుంబాల వారు రక్తసంబంధీకులు కావడంతో ఎక్కడి వారు అక్కడే అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సంఘటనకు కారకుడైన భీమ్లా తండాకు చెందిన కారు డ్రైవర్ గుగులోత్ నామ్‌సింగ్‌ను అప్పగించాలని ఆగ్రహించిన అనిత బంధువులు ఆయన కుమారుడు రాజేష్‌పై చేయి చేసుకున్నారు. భీమ్లా తండా, జగ్య తండాలో బాధిత కుటుంబాలను శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మృతదేహాలకు నివాళి అర్పించారు. రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. శివ్వంపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు మహేష్ గుప్తా బాధిత కుటుంబాలను తూప్రాన్ ఆసుపత్రిలో బుధవారం రాత్రి పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.



జగ్యా తండాలో ఆవేదనలో అనిత భర్త మోహన్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



అంజయ్య

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో ఓ రైతు పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెల్పుల అంజయ్య (51)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు, తరచుగా కుటుంబ కలహాలు చోటుచేసుకుంటుండటంతో అంజయ్య పోతారెడ్డిపేటలో కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య గంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో వృద్ధుడు..

తూప్రాన్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్‌లో గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. పండ్ల వ్యాపారి ఉడుత నాగయ్య (75) తూప్రాన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఓ ఇంట్లో భార్య లక్ష్మితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నాగయ్య పక్కనే ఉన్న రేకుల షెడ్డుల్లో ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి లక్ష్మికి భర్త కనిపించకపోవడంతో బయటకు వెళ్లేందుకు యత్నించింది. గడియ పెట్టి ఉండటంతో పక్కింటి వారి సాయంతో బయటకు వచ్చి చూడగా నాగయ్య విగతజీవిగా కనిపించాడు. నాగయ్య మృతిపై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గిరిజన న్యాయ కళాశాల పిలుస్తోంది!

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

ఈనెల 19న తక్షణ ప్రవేశాలు

గిరి పుత్రులను న్యాయ విద్యలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట న్యాయ కళాశాలను ఏర్పాటుచేసింది. దేశంలో గిరిజన (పురుషుల) గురుకుల న్యాయ కళాశాల ఇదొక్కటే కావడం విశేషం. ప్రస్తుతం న్యాయ విద్య కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 19న తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఇక్కడ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం విశేషం.

ఐదేళ్ల కోర్సు..

ఇంటర్ అర్హతతో లాసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్లు సైతం వర్తింపజేస్తారు. ఇక్కడ సీటు సాధిస్తే ఐదేళ్లలో న్యాయ విద్య కోర్సు (బీఏ, ఎల్ఎల్‌బీ) పూర్తి చేయవచ్చు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతోంది. ఏటా 60 మందికి తొలి సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ కళాశాలను ఎంచుకోకపోవడంతో సీట్లు మిగిలిపోతున్నాయి. గత విద్యా సంవత్సరం 34 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు షురూ అయిన నేపథ్యంలో ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.



గిరిజన గురుకుల న్యాయ కళాశాల


కళాశాలలో విద్యార్థులు

- ప్రథమ: 20
- ద్వితీయ: 26
- తృతీయ: 27
- నాలుగో: 37
- ఐదో: 31

మెరుగైన సదుపాయాలు

కళాశాలలో సీటు సాధిస్తే ఎలాంటి ఖర్చు లేకుండానే కోర్సు పూర్తి చేయవచ్చు. భోజన, వసతి సదుపాయాలు ఉంటాయి. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 కంప్యూటర్లతో కూడిన ఈ-గ్రంథాలయం కూడా ఉండటం విశేషం. విద్యార్థుల ఆరోగ్యానికి బాటలు వేసేలా ఆధునిక వ్యాయామశాల ఏర్పాటుచేశారు.

సద్వినియోగం చేసుకోవాలి — నిరీక్షణరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్




సంగారెడ్డిలోని గిరిజన సంక్షేమ గురుకుల న్యాయ కళాశాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తొలి సంవత్సరంలో 60 సీట్లకు అత్యధికంగా 51 సీట్లు ఎస్టీలకే ఉంటాయి. మిగతా వాటిని రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తారు. ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాం. ప్రవేశాలు పొందిన వారిలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు హైకోర్టులో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ సమయంలో స్టైపండ్ అందుతుంది.



మెదక్ చర్చిలో విదేశీయుల సందడి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్‌లోని సీఎస్ఐ చర్చిని గురువారం అమెరికాకు చెందిన 19 మంది సందర్శించారు. వారు ప్రార్థనా మందిరంలో ఆరాధన చేపట్టారు. చర్చిని సందర్శించి స్వీయ చిత్రాలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు. పలువురు వారితో చిత్రాలు దిగి సందడి చేశారు. – న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

పల్లె నుంచి సినీ దర్శకుడిగా..



సిద్దిపేట జిల్లా చేర్యాల పరిధి గుర్జకుంటకు చెందిన పుర్మ స్మరణ్‌రెడ్డి సినీ దర్శకుడిగా మారడం అక్కడి వారిలో సంతోషాన్ని నింపింది. అతడికి సినిమాలు అంటే ప్రాణం. అదే ఇష్టంతో అడుగేసి చిత్ర దర్శకుడిగా మారడం విశేషం. స్మరన్‌రెడ్డి తల్లిదండ్రులు అరుణ, రాంభూపాల్‌రెడ్డి. కుటుంబం చేర్యాలలో స్థిరపడగా, స్మరణ్‌రెడ్డి పది వరకు స్థానికంగా చదువుకున్నారు. ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు. సినిమాలపై మక్కువతో ఇంజినీరింగ్ పూర్తవగానే ఈ రంగాన్ని ఎంచుకున్నారు. చిత్ర దర్శకురాలు నందినిరెడ్డి వద్ద సహాయకుడిగా పనిచేశారు. 2017లో 'ఎమోషన్' లఘుచిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'లవ్ రెడ్డి' సినిమా రూపొందించారు. 'ఆంధ్ర- కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో యువ జంట ప్రేమే ఈ చిత్ర కథాంశం. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. వాస్తవ ఘటనల ఆధారంగా నా తొలి చిత్రాన్ని రూపొందించానని, మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు డ్రిస్టిబ్యూట్ చేయడం సంతోషంగా ఉందని స్మరణ్‌రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, చేర్యాల

నీతో మేమూ వస్తాం..

- పక్కింటి యువకుడి బైకు ఎక్కిన విద్యార్థులు
- బస్సు ఢీకొని ముగ్గురూ దుర్మరణం

పూడూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడితో సహా యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరోయువకుడు ప్రాణాలు వదిలారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పూడూరు గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గొంగుపల్లికి చెందిన ఎం.ప్రవీణ్(21) కూలీ. అతడికి భార్య అఖిల, ఏడాది కుమారుడు ఉన్నారు. మేడికొండలోని తన అమ్మమ్మ ఊరిలో శుభకార్యానికి రెండు రోజుల కిందట ఒంటరిగా వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థులు వికారాబాద్ వైపు వెళ్లాల్సిన చిల్కమర్రి నవీన్‌కుమార్(20), బుడ్డమొళ్ల హర్షవర్ధన్(15) తమను మన్నెగూడలో దింపాలని అభ్యర్థించారు. దీంతో అతడు కాదనలేక ఇద్దరినీ తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. గ్రామం నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పైకి చేరుకున్నారు. సరిగ్గా పూడూరు గేటు వద్దకు ద్విచక్రవాహనం రాగానే.. హైదరాబాద్ నం-1 డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు వేగంగా వెళ్తుండగా.. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనాన్ని నడిపే ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో స్థానికులు అతడిని పరిగి ఆస్పత్రికి తరలిస్తుండగా.. దారిలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి ఘటనా స్థలాల్ని సందర్శించి ప్రమాద కారణాల్ని సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ అధికారులు బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున సహాయం అందించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.



నవీన్‌కుమార్ హర్షవర్ధన్ ప్రవీణ్‌కుమార్

కళాశాలకు వెళ్తూ..

మేడికొండకు చెందిన చిల్కమర్రి యాదయ్య, అంజమ్మలకు ముగ్గురు కుమారులు. వారిది వ్యవసాయ కుటుంబం. చిన్నవాడు **నవీన్‌కుమార్** వికారాబాద్‌లోని శ్రీ అనంతపద్మనాభ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఆర్మీ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దసరా సెలవులు ముగిసిన దరిమిలా.. కళాశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రవీణ్ బైక్ లిఫ్ట్ అడిగాడు.

ఎస్సీ గురుకులానికి..

మేడికొండకు చెందిన బుడ్డమొళ్ల చిన్న నర్సింలు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కూలీ పనులు చేసుకుంటున్నారు. పెద్ద కుమారుడు స్థానికంగా పదోతరగతి చదువుతుండగా.. చిన్నకుమారుడు **హర్షవర్ధన్** వికారాబాద్ పట్టణ పరిధి అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ముగియడంతో గురుకులానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఎక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఇద్దరూ పక్కపక్క నివాసాల్లో ఉండడంతో స్థానికంగా విషాదం అలుముకొంది.

ఆధారం కోల్పోయిన కుటుంబం..

ప్రవీణ్‌కుమార్‌కు దోమ మండలం దాదాపూర్‌కు చెందిన అఖిలతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య, కుమారుడు ఇద్దరూ.. దసరాకు పుట్టింటికి వెళ్లారు. దీంతో భర్త ఒక్కడే శుభకార్యానికి వెళ్లాల్సి వచ్చింది. అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తన ఆధారం కోల్పోయామని కన్నీరు మున్నీరైంది.

వాహనం ఢీకొని.. వివాహిత దుర్మరణం



వనిత

వర్గల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వివాహిత మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన దేవేందర్ కుటుంబీకులతో హైదరాబాద్ దోమలగూడలో ఉంటూ పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. పండగకు ఇంటికి వెళ్లిన తల్లి గోపన్నగారి వనిత(46) సహా దేవేందర్ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమం జరిగిన ప్రమాదంలో దేవేందర్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోయాడు. తల్లి వనిత రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. వనితకు భర్త, ఇద్దరు కుమారులు దేవేందర్, చాణక్య ఉన్నారు.

కారు బోల్తాపడి వ్యాపారి..

కొండపాక గ్రామీణం (కుకునూరుపల్లి): కారు బోల్తాపడి ఓ వ్యాపారి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ కాచిగూడలో కార్వ రాజేశ్(42) వ్యాపారం చేస్తున్నాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి కారులో గురువారం తెల్లారుజామున తిరుగు ప్రయాణమయ్యాడు. రాజీవ్‌రహదారిలో కుకునూరుపల్లి వద్ద రోడ్డు పక్కన ఇనుప కడ్డీలకు తాకి అనంతరం మరో కారును ఢీకొని బోల్తాపడింది రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు కాల్వ బేణిగోపాల్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

సిద్దిపేట టౌన్: రాజీవ్‌రహదారిపై రంగీలా దాబా చౌరస్తా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల మల్లారెడ్డి (65)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. గురువారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. మల్లారెడ్డిని హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోదరుడు యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కళలకు జీవం పోయడం అభినందనీయం

దుబ్బాక, న్యూస్‌టుడే: అంతరించిపోతున్న ఒగ్గు కళలకు తెలంగాణ ప్రభుత్వం జీవం పోసి, వెలికితీయడం అభినందనీయమని ఒగ్గు కథల ప్రధాన శిక్షకులు కొలుపుల మహేశ్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి వారి ఆధ్వర్యంలో గురువారం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఒగ్గుకథ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సహకారంతో ప్రారంభించిన ఈ శిక్షణ శిబిరంలో 40 మందికి 41 రోజులపాటు ఒగ్గు కథపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సహాయ శిక్షకులు గుట్టయ్య, దేవయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరాలయంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొలుపుల మహేశ్

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

రయ్‌మంటూ.. ప్రమాదం వైపు



పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: బాలలకు వాహనాలివ్వద్దని పోలీసులు అవగాహన కల్పిస్తూ.. సూచనలిస్తున్నా.. తల్లిదండ్రులు పెడచెవిన పెడుతున్నారు. పరిగి ప్రాంతంలోని రహదారులపై భారీ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులు రక్త సిక్తమవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు ఆసుపత్రుల పాలుకాగా.. మరి కొందరు దుర్మరణం పాలవుతున్నారు. కానీ ఇదిగో బాలురు ద్విచక్ర వాహనంపై పరిగి-మహబూబ్‌నగర్ రహదారిపై రాఘవాపూర్ కూడలి వద్ద వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ వెలుతున్నారిలా..

విద్యార్థుల మృతి బాధాకరం: ఎమ్మెల్యే



ఆర్థిక సాయం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పూడూరులో జరిగి ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు, ఒక యువకుడు మృతి చెందాడు. ఆ మృతదేహాల్ని పరిగి ప్రభుత్వాసుపత్రిలో పరిశీలించారు. బాధిత కుటుంబీకులకు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందించి మాట్లాడుతూ.. కలెక్టర్‌తో మాట్లాడి ఆర్థిక సాయం అందించేందుకు తమవంతు కృషి చేస్తామని.. కుటుంబ సభ్యులకు ఉద్యోగాల కల్పనకు ప్రయత్నిస్తామని చెప్పారు.

లక్ష్యం ఘనం.. సౌకర్యాలు కనం

పల్లెల్లో క్రీడా ప్రాంగణాల తీరిది

న్యూస్‌టుడే, పరిగి:

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు గ్రామాల్లో అలంకార ప్రాయంగా మారాయి. ఆర్భాటంగా ఏర్పాటు చేయడమే తప్ప వాటిలో వసతుల కల్పన విస్మరించారు. దీంతో ఆదిలోనే లక్ష్య సాధనకు తీరని అవరోధంగా మారింది. స్థల విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో క్రీడా ప్రాంగణానికి ప్రభుత్వం రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు వెచ్చించింది. ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున ఏర్పాటు చేసి క్రీడా పరికరాలను కూడా పంపిణీ చేసింది. వీటి నిర్మాణం జరిగి నెలలు అవుతున్నా నిర్వహణ కొరవడింది. కొన్నిచోట్ల బోర్డులను ఏర్పాటు చేసి ఆటాడుకునేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటు మాత్రం పట్టించుకోలేదు. వెరసి యువకులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిర్మాణాలు పూర్తిచేసి చాలాచోట్ల రెండేళ్లవుతున్నా 25 శాతం కూడా వినియోగంలో లేవు. ఆట మైదానాలు అనువుగా లేకపోవడం కూడా ప్రధాన సమస్యగానే మారింది. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 566 పంచాయతీల పరిధిలో దాదాపు 535 ప్రాంగణాలను పూర్తిచేశారు. వీటి కోసం సుమారు రూ.20కోట్లకు పైగా ఖర్చు చేశారు.



రంగాపూర్ సమీపంలోని క్రీడా ప్రాంగణం

అన్నిచోట్లా అదే పరిస్థితి..

- పరిగి మండలం లఖ్నాపూర్ రిజర్వాయర్ సమీపాన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇక్కడ బోర్డును ఏర్పాటు చేసి ఇతర సౌకర్యాలేవీ కల్పించ లేదు.
- కాళ్లాపూర్ గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ఎవరూ అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.
- జాఫర్‌పల్లిలో క్రీడా మైదానం ఎగుడు దిగుడుగా ఉంది. వెనుకభాగంలో రాళ్ల రప్పలు దర్శనమిస్తున్నాయి.
- కుల్కచర్ల క్రీడా ప్రాంగణాన్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఓ గుట్ట వెనక ఏర్పాటు చేశారు. రాళ్ల రప్పలు మైదానంలో ఉండటంతో ఏమాత్రం అనువుగా లేదు.
- సాల్వీడులో చెరువు పక్కన ఏర్పాటు చేయడంతో భారీ వర్షాలు కురిస్తే మైదానం బురదగా మారుతుంది.
- యాలాల గ్రామంలో కుంట సమీపాన ఏర్పాటు చేయడంతో అసౌకర్యంగానే మారింది.

బాధ్యత పంచాయతీలదే

- ఉష, ఏపీవో, ఉపాధిహామీ

ప్రాంగణాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలు చూసుకోవాలి. చాలా వరకు వినియోగంలో ఉన్నాయి. యువకులు క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పంచాయతీలకు క్రీడా పరికరాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేసింది.



కుల్కచర్లలో పొదల మధ్య పరికరాలు

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, పూడూరు, ధారూర్, తాండూరు టౌన్:

? పరిగి పట్టణం నుంచి సయ్యద్ మల్కాపూర్ గ్రామ శివారు వరకు తారు కొట్టుకుపోయి వందలాది గుంతలతో అధ్వానంగా మారింది. రెండేళ్లుగా మరమ్మతు పనులు చేయకపోవడంతో వాహనదారులకు నరక ప్రాయంగా మారింది. **– మల్లిఖార్జున్, లింగం, భీమయ్య, రాములు వాహనదారులు, పరిగి మండలం**

✓ సయ్యద్ మల్కాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు రహదారి పనులను తొందర్లోనే ప్రారంభించి పూర్తిచేయిస్తాం.
– డి.మహేష్, ఏఈ ఆర్‌అండ్‌బీ శాఖ, పరిగి

? గ్రామం నుంచి మేడిపల్లికలాన్ వైపువెళ్లే దారిలో వాగువద్ద రోడ్డు పక్కన గంత ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– జనార్దన్, నిజాంపేట్‌మేడిపల్లి

✓ వెంటనే అధికారుల దృష్టికి తీసుకవెళ్లి తాత్కాలికంగా మరమ్మతులు చేయించి సమస్య రాకుండా చూస్తాం. **– సుందర్, ఎంపీవో.**

? మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకిరువైపులా మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. **– రాములు, ధరూర్ స్టేషన్**

✓ పరిశీలించి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.
– ప్రణీత్, పంచాయతీ రాజ్ శాఖ, ఏఈ ధారూర్

? మార్కండేయనగర్‌లో అంతర్గత రోడ్లు పూర్తి స్థాయిలో లేవు. రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. **– వెంకట్, తాండూరు**

✓ సమస్య పరిష్కరించటానికి కృషి చేస్తాం. **– విక్రమసింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.**

చెట్లు.. సి(చి)త్రాలు



వికెట్ల మాదిరిగా తాటి చెట్లు

దుద్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుండి సోమ్లానాయక్ తండాకు వెళ్లే మార్గంలో ప్రకృతి చిత్రాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ప్రధాన రోడ్డు పక్కనే మర్రిచెట్టు కాండం లోపల నుంచి తాటి చెట్టు మొలిచింది. అయితే మర్రి చెట్టును తదేకంగా చూస్తే తప్పా తాటి చెట్టు కనపడదు. తాటి చెట్టు కాండం కనపడకుండా కేవలం పై భాగంలో తాటికమ్మలు మాత్రమే కనపడుతున్నాయి. అలాగే మర్రి వృక్షం ఊడలు భూమిని తాకుతున్నాయి. అదే విధంగా అచ్చం వికెట్ల మాదిరిగా మూడు తాటి చెట్లు ఒకే వరుసలో సమాన దూరంలో ఉండి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



మర్రిచెట్టు మొదలునుంచి పెరిగిన తాటి చెట్టు

మూత ఏర్పాటు చేయరూ..



దోమ, న్యూస్‌టుడే: దోమలో నీటి సరఫరా గేట్‌వాల్స్‌కు గుంతలపై మూతలు లేక స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 7వ వార్డులో వాటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. స్థానికులు ఒక దానిపై రాయి మూసేశారు. ఇతర చోట్లా ఖాళీగా వదిలేశారు. ద్విచక్రవాహనాల రాకపోకలకు, రాత్రివేళ ప్రమాదాల బారిన పడుతున్నారు.

మల్లికార్జునుడి సన్నిధిలో మాజీ ఎమ్మెలే రోహిత్‌రెడ్డి



న్యూస్‌టుడే, తాండూరు: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తన సతీమణి ఆర్తీరెడ్డితో కలిసి గురువారం శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

తాండూరుగ్రామీణ: పౌర్ణమిని పురస్కరించుకొని తాండూరు అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానపీఠం వద్ద విష్ణువర్ధన్‌రెడ్డి, సుధారాణి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

స్థల వివాదంపై ఎంఈవో విచారణ

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మేడిచెట్టుతండా పాఠశాల పక్కన ఉన్న స్థల వివాదంపై ఎంఈవో హరిలాల్ గురువారం విచారణ చేపట్టారు. తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులు గతంలో పాఠశాల, అంగన్‌వాడీ, మంచినీటి ట్యాంకు నిర్మాణం కోసం స్థలాన్ని దానంగా ఇచ్చారు. పాఠశాల పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో తాము ఇల్లు కట్టుకుంటామని స్థల దాతలు చెప్పగా, ఆ స్థలం పాఠశాలకు చెందినదని ఇంటి నిర్మాణం ఎలా చేపడుతారని తండా వాసులు అభ్యంతరం చెప్పారు. ఈ విషయమై గురువారం పాఠశాలకు వచ్చిన ఎంఈవో హరిలాల్ హెచ్‌ఎం వీణా రాణి, తండా ప్రజలతో వివరాలు సేకరించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంఈవో చెప్పారు. అనంతరం ఏర్పుమళ్ల యూపీఎస్‌ను ఎంఈవో సందర్శించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సోమ్లానాయక్ పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఛైర్మన్ అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య


పరిగి, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. పురఛైర్మన్ అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్యతో పాటు పలువురు కౌన్సిలర్లు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మేనేజరు నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

తాండూరు టౌన్: వాల్మీకినగర్ కాలనీలోని జయంతి ఉత్సవాలు నిర్వహించారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు తాటికొండ స్వప్న, కౌన్సిలర్లు సోమశేఖర్, ప్రభాకర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, మల్లేషం, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు కాలినడకన స్వాములు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి పలువురు అయ్యప్ప మాలధారులు శబరిమలకు కాలినడక బయలుదేరారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చండీహోమంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



పుట్టాపహాడ్‌లో..

కుల్కచర్ల గ్రామీణ: పుట్టాపహాడ్‌లోని శ్రీ గురుకృప కల్యాణ మండపంలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యజ్ఞ, హోమ పూజాది కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజలందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు రాజు, నాయకులు రాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నారాయణగౌడ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఆవశ్యకత తెలుసుకోండి



పాంబండ గిరిప్రదక్షిణలో భక్తులు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: గిరి ప్రదక్షిణ ఆవశ్యకతలను అందరూ తెలుసుకోవాలని పాంబండ ఆలయ అర్చకుడు పాండు శర్మ, హిందూబంధు సభ్యులు నర్సింహారెడ్డి, చందు, గోపాల్‌రెడ్డి అన్నారు. పౌర్ణమి సందర్భంగా రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర గిరి ప్రదక్షిణ చేపట్టారు.

ఏటీసీ ఐటీఐ కేంద్రానికి శాసనసభాపతి భూమిపూజ

వికారాబాద్, న్యూస్‌టుడే: వికారాబాద్ పట్టణం రామయ్యగూడ రోడ్డులోని రాజీవ్‌గృహకల్ప సమీపంలో రూ.4.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఏటీఆర్, ఐటీఐ) భవన నిర్మాణానికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, పురపాలిక అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ఎస్కార్ట్ రచ్చ

బషీరాబాద్, న్యూస్‌టుడే: అనధికార కార్యక్రమానికి వచ్చిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడికి పోలీసులు ఎస్కార్ట్ ఇవ్వడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. గురువారం మధ్యాహ్నం ఓ హోటల్, వస్త్ర దుకాణం ప్రారంభించడానికి.. సదరు నేత బషీరాబాద్ పరిధికి రాగానే పోలీసు వాహనంతో వెనకాల ఎస్సై గఫార్ తన ప్రైవేట్ వాహనంతో ముందు భాగంలో వెళ్లారు. అందరు కలిసి దుకాణాలను ప్రారంభించి వెళ్లిపోయారు. కాగా ఇదే విషయంపై ఎస్సై వివరణ కోరాగా.. తాము ఎవరికీ ఎస్కార్ట్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్‌నేత వెళ్లే సమయంలో తాము బషీరాబాద్‌కు వెళ్లనని వాహనాలు వెనకా ముందు అయ్యాయన్నారు.

ఎస్సై మృతికి కారకులైన శాఖ వారిని అరెస్టు చేయండి

తాండూరు, న్యూస్‌టుడే: అశ్వారావుపేట ఠాణాలో పనిచేసిన ఎస్సై బలవన్మరణానికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం తాండూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కులఅసమానతల నిర్మూలన పోరాట సమితి కన్వీనర్ వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పాండ్యా నాయక్

దుద్యాల, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోటిబండ తండాకు చెందిన రాథోడ్ పాండ్యానాయక్ (61) తన పొలంలో పశువుల కోసం మేత కోస్తున్నాడు. బోరుమోటారు దగ్గర విద్యుత్తు తీగ గమనించక తాకాడు. విద్యుదాఘానికిగురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన అన్న ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తమ్ముడు ప్రతాప్ అక్కడికి వెళ్లి చూడగా.. అక్కడే పాండ్యానాయక్ విగతజీవిగా పడి ఉన్నాడు.

ప్రమాదవశాత్తు వాగులో పడి ..

మర్పల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన ప్రకారం.. పంచలింగాల్ గ్రామానికి చెందిన శంకరయ్య (61) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం పని నిమిత్తం పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. గ్రామంలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెతుకుతున్న క్రమంలో గురువారం ఉదయం పొలం పక్కనే ఉన్న వాగులో అతని మృతదేహం లభ్యమైంది. పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఠాణా వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్ మండలంలోని ఓ తండాకు చెందిన మహిళ కూతురు పెళ్లికి సంబంధించి ఒప్పందం ప్రకారం రూ.14 లక్షలు చెల్లించే స్థోమత లేదంటూ పెట్రోల్ డబ్బాతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్యకు యత్నించింది. ఎస్ఐ గఫార్, పోలీసు నివారించి వివరాలు సేకరించారు. కొద్ది నెలల క్రితం గ్రామ పెద్దలతో కుదిరిన ఒప్పందం ప్రకారం కూతురు పెళ్లి ఖర్చులు రూ.14 లక్షలు మగపెళ్లి వారికి చెల్లించాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా చెల్లించక పోవడంతో అవతలి వారు ఒత్తిడి పెంచారు. దీన్ని భరించలేక ఆమె గురువారం ఠాణాకు వచ్చి గోడు వెళ్ల బోసుకుంది. మీరే న్యాయం చేయాలని పెట్రోల్ డబ్బా చేత పట్టుకొని ఒంటిపై పోసుకుంది. అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది నివారించారు. వివరాలు తెలుసుకొని మా పరిధి అంశమైతే తప్పకుండా మీకు న్యాయం చేస్తామని ఎస్ఐ, పోలీసులు ఆమెకు తెలిపారు.

గంజాయి నిల్వ చేసిన వ్యక్తి అరెస్ట్

మోమిన్‌పేట: అక్రమంగా గంజాయి ఇంట్లో నిల్వచేసిన ఓ వ్యక్తిని ఆబ్కారీ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం మోమిన్‌పేట ఆబ్కారీ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సహదేవుడు తెలిపిన వివరాలు.. మర్పల్లి గ్రామానికి చెందిన జీలకర్ర రాజశేఖర్ (24) గంజాయి తాగేందుకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 133 గ్రాముల ఎండు గంజాయి కొనుగోలు చేసుకొని ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. నమ్మదగ్గ సమాచారం అందండంతో రాజశేఖర్ ఇంట్లో ఎస్ఐ రేఖ, సిబ్బంది నర్సింహులు, జ్ఞానేశ్వర్, శ్రీశైలం, అనీలతో కలిసి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితుడని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

నవాబ్‌పేట: చోరీ కేసులో నిందితుడిని రిమాడ్‌కు తరలించారు. ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట మండలం.. గంగ్యాడ గ్రామానికి చెందిన ఎం.అనిల్ కుమార్ ఈ నెల 4న రాత్రి సమయంలో మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన తాళం వేసి ఉన్న నరసింహా రెడ్డి ఇంటికి వెళ్లి చోరీకి యత్నించాడు. అనంతరం ఊర కుర్వ వెంకటయ్య ఇంటి తాళం పగులగొట్టి 3 తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. మరుసటి రోజు తెరచి ఉన్న ఇంటిని గమనించి, కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి వెళ్లిన వెంకటయ్యకు గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. తిరిగి వచ్చిన ఆయన, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు, బుధవారం మండల పరిధిలోని పూలపల్లి గేటు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి కనిపించడంతో పట్టుకొని విచారించడంతో విషయం బయట పడింది. నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్లను తాకుతూ.. ప్రమాదకరంగా మారుతూ..

గ్రామాల్లో విద్యుత్తు తీగలు

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ, కుల్కచర్ల



కుల్కచర్లలో..

గ్రామాల్లో విద్యుత్తు తీగలు ఇళ్ల మధ్యన, ఇళ్ల పై భాగంగా ప్రమాదకరంగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కుల్కచర్ల మండలంలోని అంతారం, సాల్వీడ్, చెల్లాపూర్ గ్రామాల్లో గతంలో పలు విద్యుత్తు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదకరంగా మారిన తీగలను గుర్తించి వెంటనే సరి చేయించేలా చూడాల్సి ఉన్నా.. ఆ ప్రయత్నం జరగకపోవడం ఆందోళన వ్యక్తమౌతోంది.

మచ్చుకు కొన్ని.. • కుల్కచర్ల అంగడిబజార్‌లో విద్యుత్తు తీగలు ఇళ్లను తాకుతూ కనిపిస్తున్నాయి. చాలా రోజులుగా ఇలాగే ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. • పీరంపల్లి గ్రామంలోనూ అలానే ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. • బండవెల్కిచర్ల గ్రామంలో ఇళ్లకు, చెట్లకు ఆనుకుని ఉన్నట్లు కనిపిస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. • దాస్యానాయక్‌తండాలో ఇళ్ల మధ్య నుంచి ప్రమాదకరంగా ఉన్నాయి. తీగలు వదులుగా ఉండటంతో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయించాల్సి ఉంది.

• సాల్వీడ్ గ్రామంలో ఇళ్లను తాకే విధంగా కనిపిస్తున్నాయి. సరి చేయించాల్సిన అవసరం ఉంది. • కుల్కచర్ల గ్రామ పంచాయతీ ఆవరణ కాలనీలో ఇళ్ల మధ్యనే ఉన్నాయి. భారీ వాహనం కాలనీలో నుంచి వెళ్లలేని పరిస్థితి ఉంది. • దోమ మండలం మోత్కూర్ గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకుంది.



పీరంపల్లిలో

సరి చేయిస్తాం..

- సాయికిరణ్, ఏఈ, విద్యుత్తు శాఖ

గ్రామాల్లో విద్యుత్తు తీగల సమస్యలను పరిష్కరించేలా చూస్తున్నాం. వర్షాకాలంలోనే సాధ్యమైనంత వరకు వేలాడుతున్న తీగలను సరిచేయించడం జరిగింది. గ్రామాల్లో అక్కడక్కడా విద్యుత్తు తీగలు ఇళ్ల మధ్యన ప్రమాదకరంగా ఉన్నాయనే సమస్య మా దృష్టికి వచ్చింది. వాటిని సరి చేయించాలంటే స్తంభాల ఏర్పాటు లేదా తీగలకు తొడుగులను ఏర్పాటు చేయించాల్సి ఉంటుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తాం.

19, 20న సీపీఎం జిల్లా మహాసభలు

దుద్యాల: ఈ నెల 19, 20 తేదీల్లో తాండూరులో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం దుద్యాలలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

తండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

యాలాల: రేండ్లగడ్డ తండా, పగిడిపల్లి, జుంటిపల్లి గ్రామస్థులు చిరుత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రేండ్లగడ్డ తండా, పగిడిపల్లి, జుంటిపల్లిలో శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి పర్యటించి మాట్లాడారు.

ఇంకా ఆరుబయటకే..

పూర్తికాని శౌచాలయాలు, నిర్మించినా నిరుపయోగం

న్యూస్‌టుడే, పూడూరు: ప్రతి ఇంటికి వ్యక్తిగత శౌచాలయం ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గతంలో గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఒక్క పూడూరు పరిధిలోనే 6,039 కుటుంబాలకు వ్యక్తిగత గౌరవ గృహాలు లేవని గుర్తించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా నిర్మాణాలు పూర్తి చేసిన వారికి ఒక్కోదానికి రెండు విడతల్లో రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని ప్రోత్సాహకంగా అందించారు. రెండు గుంతలతో కూడినవి నిర్మాణం చేపట్టాలనే నిబంధన విధించారు. కొందరు ఒకే గుంత తీయడంతో అప్పట్లో బిల్లులు ఇవ్వలేదు. దీంతో చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని చోట్ల పూర్తయినా అవి వినియోగించడం లేదు.

రోడ్లపక్కనే...

- చెంచుపల్లి నుంచి మీర్జాపూర్ వైపు వెళ్లే ప్రధాన దారిలో ఇరువైపులా మలమూత్ర విసర్జన చేస్తుండటంతో అటుగా వెళ్లేవారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అక్కడా ప్రతి ఇంటికి వ్యక్తిగత శౌచాలయం నిర్మాణం చేపట్టాలని ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. చాలా చోట్ల అసంపూర్తిగా మారాయి. కొన్ని పూర్తయినా అరు బయటకు వెళ్తున్నారు.



చన్‌గోముల్‌లో నిరుపయోగంగా ..

- పెద్దఉమ్మెంతాల్ నుంచి కంకల్, మేడిపల్లికలాన్‌ల వైపు వెళ్లే మధ్యదారిలో ఇదే పరిస్థితి మట్టిదారి కావటంతో అక్కడా పరిస్థితి ఇబ్బందిగా ఉంది.
- పూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహం, ప్రభుత్వ కారాలయాలకు వెళ్లే దారి పక్కనే తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కార్యాలయాలకు వచ్చిపోయే జనాలతో పాటు సిబ్బంది దుర్వాసన భరించలేక పోతున్నారు.
- దోమ మండల కేంద్రంతో పాటు మోత్కూరు, బట్లచందారం, పాలెపల్లి, ఐనాపూర్ గ్రామాల్లో మరుగుదొడ్లు లేవు.

పూర్తి చేయిస్తాం

– పాండు, ఎంపీడీవో, పూడూరు

గ్రామాల్లో ఎక్కడయితే అసంపూర్తిగా ఉన్నాయో గుర్తించి పూర్తి చేయించే విధంగా చూస్తాం, కొత్తగా మంజూరు విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. కొన్ని ఇళ్లకు వ్యక్తిగత శౌచాలయాలు ఉన్నా.. కొందరు సక్రమంగా వినియోగించు కోవడం లేదు. మల, మూత్ర విసర్జనకు ఇంకా అరుబయటకు వెళ్లున్నట్లు తెలుస్తుంది. అపరిశుభ్రంగా మారటం, రాత్రీల్లో క్రిమీ కీటకాలతో ముప్పు ఉంటుంది. ప్రతి ఒక్కరు వాటిని ఉపయోగించుకునే విధంగా అవగాహన కల్పిస్తాం.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

వికారాబాద్, న్యూస్‌టుడే: వికారాబాద్ సీఐగా నియమితులైన బీమ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

గోసంరక్షణ అందరి బాధ్యత

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: గోసంరక్షణ అందరి బాధ్యత అని అయ్యప్ప గురు స్వామి చెన్నయ్య, పవన్‌కుమార్ అన్నారు. ఘనాపూర్ గ్రామంలోని రామలింగేశ్వర గోశాలను సందర్శించి పూజలు జరిపించారు. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనన్నారు. రాఘవేందర్‌గౌడ్, చంద్రశేఖర్, రాఘవేంద్రాచారి, శ్రీనివాస్, నర్సింలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఛైర్మన్‌కు సత్కారం

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గురువారం జిల్లా కేంద్రంలో రాజేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.